

ఎదులాపురం: మాజీ మంత్రి జోగురామన్నకు శుభాకాంక్షలు తెలుపుతున్న తెలంగాణ ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బండారి కృష్ణ

తాంసి: ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న జడ్పీటీసీ తాటిపల్లి రాజు, బీఆర్ఎస్ నాయకులు

# ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

బోథ్/భీంపూర్/తాంసి/ఎదులాపురం, జనవరి 1: జిల్లా వ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకలు ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. రాత్రి 12 గంటల తర్వాత కేక్ కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, యువకులు సోమవారం నేరడిగొండలో బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్, ఆదిలాబాద్‌లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న, మాజీ ఎంపీ నగేశ్‌ను వారి వారి నివాసాలలో, పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రావుత్ మనోహర్, మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజానీ, తెలంగాణ ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బండారి కృష్ణ, ఉపాధ్యక్షుడు విజ్జగిరి నారాయణ, అధికార ప్రతినిధి గంగారెడ్డి, కౌన్సిలర్లు భరత్‌కుమార్, షానావజ్, బీఆర్ఎస్ బోథ్ మండల కన్వీనర్ నారాయణ రెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, తాంసి జడ్పీటీసీ రాజు, ఎంపీపీ సురకుంటి మంజులాశ్రీధర్ రెడ్డి, సర్పంచ్‌ల సంఘం తాంసి మండలాధ్యక్షుడు సదానందం, సర్పంచ్‌లు ఎంపీటీసీలు, యూత్ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ రూరల్, జనవరి 1 : ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను క్యాంపు కార్యాలయంలో బీజేపీ నాయకులు, అధికారులు కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.



బోథ్: మాజీ ఎంపీ నగేశ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

# ఆశయ సాధనకు పాటుపడాలి

- ఘనంగా భీమా కోరేగావ్ శౌర్య దివస్
- అమరులైన మహార్ సైనిక్ స్తూపం, చిత్రపటాలకు నివాళులర్పించిన నాయకులు



ఎదులాపురం: అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జిల్లా అధ్యక్షుడు దుర్గం శేఖర్

ఎదులాపురం, జనవరి 1 : మహనీయుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుంటూ వారి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు పాటు పడాలని నేతకానీ మహార్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దుర్గం శేఖర్ అన్నారు. భీమా కోరేగావ్ శౌర్య దివస్ సందర్భంగా ఆదిలాబాద్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి సోమవారం పుష్పాంజలి ఘటించి, నివాళులర్పించారు. భీమా కోరేగావ్ యుద్ధంలో అసువులు బాసిన అమరుల త్యాగాలను స్మరించుకున్నారు. అలాగే స్థానిక భుక్తాపూర్‌లోని మహాప్రజ్ఞ బుద్ధ విహార్ వద్ద ఉదయ్ జాడే, మాస్కే రాజు, పటాడే రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరయ్యారు. భీమా కోరేగావ్ యుద్ధంలో వీరమరణం పొందిన మహార్ సైనికులకు తాత్కాలిక స్తూపం వద్ద దుర్గం శేఖర్, ప్రజ్ఞాకుమార్‌లు పుష్పాంజలి ఘటించారు. అంబేద్కర్, బౌద్ధుడు చిత్రపటాలకు పూలమాలలు వేశారు. కార్యక్రమంలో దళిత సంఘం నాయకులు అనిల్‌స్వాలే, దయానంద్ కాంబ్లే, సూరజ్‌కాంబ్లే రాహుల్, వాగ్మారే చంద్రకళబాయి పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి, జనవరి 1: మండల కేంద్రంలో భీమ్ ఆర్మీ, దళిత సంఘల నాయకుల ఆధ్వర్యంలో సోమవారం భీమా కోరేగావ్ విజయ శౌర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ చౌక్‌లో మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, దళిత బౌద్ధ ఉపాసకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం భీమా కోరేగావ్ యుద్ధంలో వీర మరణం పొందిన మహార్ సైనికులకు తాత్కాలిక స్తూపం వద్ద నివాళులర్పించారు. దళితుల బౌద్ధ ఉపాసకుల ఆధ్వర్యంలో బుద్ధవందన, దమ్మవందన, సంఘవందన తీసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ 1818 జనవరి 1వ తేదీన భీమా కోరేగావ్‌లో జరిగిన యుద్ధంలో విరమరణం పొందిన మహార్ సైనికులను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ప్రతి సంవత్సరం జనవరి1వ తేదీన విజయోత్సవ శౌర్య దివస్‌ను మహార్ సైనికుల విజయోత్సవ శౌర్య దివస్‌గా దళితుల ఆధ్వర్యంలో జరుపుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ఆర్కా పుష్పలత, ఆయా సంఘాల నాయకులు వాగ్మారే కామ్‌రాజ్, ఆత్రం సుగుణ, ఆశాబాయి, సుంకట్‌రావ్, రాజ్‌వర్ధన్, శివాజీ, సూర్యవంశీ ఉత్తమ్, సోన్‌కాంబ్లే వికాస్, జితేందర్, నాగోరావ్ పాల్గొన్నారు.

నార్నూర్, జనవరి 1 : నార్నూర్, తాడిహత్నూర్, బొప్పాపూర్, మలంగి, లోకారి(కే), బుద్ధగూడతో పాటు పలు దళిత వాడల్లో దళిత సంఘాల నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విద్యావేత్త బాలాజీ కాంబ్లే, నార్నూర్ సహకార సంఘం చైర్మన్ సురేశ్, డైరెక్టర్ దుర్గే కాంతారావ్, మాల మహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, నాయకులు పాల్గొన్నారు.

### తుడుందెబ్బ ఆధ్వర్యంలో...

ఎదులాపురం,జనవరి 1 : జిల్లా కేంద్రంలోని ఆదివాసీ భవనంలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ మావల మండల కమిటీ ఆధ్వర్యంలో భీమా కోరేగావ్ శౌర్య దివస్ నిర్వహించారు. కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర కార్యనిర్వహణ అధ్యక్షుడు గణేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్, ఆదివాసీ మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు గోడం రేణుక, జిల్లా ఉపాధ్యక్షురాలు ఉయిక ఇందిర, డివిజన్ కమిటీ ఉపాధ్యక్షుడు ఆత్రం గణపతి, ముకుంద్ పాల్గొన్నారు.

బోథ్, జనవరి 1: సొనాలలో అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ సంఘ భవనం నుంచి బస్టాండ్‌లోని విగ్రహం వరకు ఊరేగింపు నిర్వహించారు. భీమా కోరేగావ్ స్తూపం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు భగత్ ప్రవీణ్, ఉపాధ్యక్షుడు సంజయ్, బత్తుల రమేశ్, మహేశ్, భీంరావ్ పాటిల్, హరీశ్, దినేశ్, లంక లలిత, అమృత్‌రావ్ పాటిల్, పోతన్న, అనిల్, ఉదయ్, మహేశ్, రాజేందర్, సోమన్న, సంతోష్, రాజశేఖర్, అరవింద్, రవి, ప్రవీణ్, కిరణ్, తరుణ్ పాల్గొన్నారు.



ఇంద్రవెల్లి: అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జడ్పీటీసీ పుష్పలత

బోథ్: నివాళులర్పిస్తున్న నాయకులు

నార్నూర్: మాట్లాడుతున్న విద్యావేత్త బాలాజీ కాంబ్లే

# సమాజాభివృద్ధికి కృషి చేయాలి

మాట్లాడుతున్న ఎన్నికైన అడ్‌హక్ కమిటీ సభ్యులు

ఎదులాపురం, జనవరి 1: విభేదాలను పక్కన పెట్టి అందరూ ఐక్యంగా ఉంటూ సమాజాభివృద్ధికి కృషి చేయాలని ఆదివాసీ పర్ధాన్ సమాజ్ నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పిట్టలవాడలోని ఆదివాసీ భవనంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివాసీ పర్ధాన్ సమాజ్ అభివృద్ధి చెందాలంటే ఐక్యతను చాటాల్సిన అవసరం ఉందన్నారు. అందులో భాగంగానే మండల, డివిజన్ స్థాయి,ఆదివాసీ పర్ధాన్ సమాజ్ కమిటీని ముందుగా నియమించాలన్నారు. ఈ నెల 7వ తేదీ నుంచి కమిటీలను నియమించాలని నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. అలాగే వచ్చే నెలలో హీరసుక్క జయంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం అడ్‌హక్ కమిటీ సభ్యులుగా పూసం ఆనంద్‌రావ్, తానాజీ, పూసం ప్రభాకర్, గేడం మాధవ్, సుభాష్, గేడం విఠల్, మెస్రం ఈశ్వర్, మడావి దిగంబర్, మెస్రం భాస్కర్, ఆత్రం అనసూయ, గంగాదేవిలను నియమించారు. కార్యక్రమంలో ఆదివాసీ పర్ధాన్ సమాజ్ ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షుడు మెస్రం శంకర్, సభ్యులు విజయ్, వెట్టి దేవీదాస్, పూసం రామాకాంత్, శివకృష్ణ పాల్గొన్నారు.

# స్వయం ఉపాధి రంగంలో రాణించాలి

ఎదులాపురం, జనవరి 1 : వృత్తి నైపుణ్య శిక్షణలను యువత సద్వినియోగం చేసుకోవాలని ఆదిలాబాద్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ యూనిస్ అక్బానీ సూచించారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో వివిధ కోర్సుల్లో శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సోమవారం సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు నెలలుగా టైలరింగ్, కంప్యూటర్, మగ్గం వర్క్‌లో యువతకు శిక్షణ అందించినట్లు తెలిపారు. ఉచిత వృత్తి నైపుణ్య శిక్షణలను సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి రంగంలో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి యకూబ్, ప్రతినిధులు బిలాల్, ఖైరత్‌అలీ, రఫీక్ పరీక్, ముజాహిద్, తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్లు అందజేస్తున్న ట్రస్ట్ చైర్మన్ యూనిస్ అక్బానీ

# రాష్ట్ర స్థాయిలో సత్తాచాటిన గిరిజన విద్యార్థులు

ఇచ్చోడ, జనవరి 1: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మిట్‌లో ఇచ్చోడ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి బంగారం పతకం సాధించారు. ఎస్ శ్రీకాంత్ పదో తరగతి అథ్లెటిక్స్ 100 మీటర్లు, లాంగ్ జంప్, 100 ఎక్స్‌లో బంగారం పతకం సాధించి ఇంటర్ సొసైటీ లీగ్‌కు అర్హత సాధించారు. అదేవిధంగా గంగప్రసాద్, లోకేశ్, లక్ష్మణ్ ఫుట్‌బాల్‌లో ప్రతిభ కనబర్చి ఉట్నూర్‌లో జరిగే ఇంటర్ సొసైటీలో పాల్గొననున్నారు. విద్యార్థులను ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా సమన్వయకర్త వీ గంగాధర్, కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్, వైస్ ప్రిన్సిపాళ్లు హరిరాం, నర్మదా, పీడీ దిలీప్ అభినందించారు.

బహుమతి సాధించిన గిరిజన విద్యార్థులు

### ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఆదిలాబాద్ రూరల్, జనవరి 1: జిల్లా కేంద్రంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచే భక్తులు దర్శనం కోసం బారులు తీరారు. ఆలయ అర్చకులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏడాదంతా పాడిపంట, కుటుంబ సభ్యులు సుఖసంతోషాలతో ఉండాలని భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

### కార్యవర్గం ఎన్నిక

ఎదులాపురం, జనవరి 1 : ఆదిలాబాద్ రూరల్ మండలం పందిరిలోద్ది గ్రామంలో గొండ్వనా యువశక్తి జై మహంకాళి యూత్ కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎర్మ జంగుబావు, ఉపాధ్యక్షుడిగా తుకారాం, ప్రధానకార్యదర్శిగా భీంరావ్, కోశాధికారిగా కుమ్ర మంతు, సభ్యులుగా గీతాచారి, సాయికుమార్‌ను ఎన్నుకున్నారు.

### బాధితునికి పరామర్శ



వంశీతో మాట్లాడుతున్న మాజీమంత్రి జోగు రామన్న

ఆదిలాబాద్ రూరల్, జనవరి 1: మావలలో కౌన్సిలర్ రఘుపతి రోడ్డు ప్రమాదం చేయించి, హత్య చేసేందుకు యత్నించగా, ప్రమాదంలో గాయపడిన వంశీ అనే యువకుడిని సోమవారం మాజీమంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ప్రహ్లాద్, నారాయణ, నల్ల రాజేశ్వర్, సుధీర్, సంతోష్, అజీమ్‌ఖాన్, సృజన్ ఉన్నారు.

### 3న సామాజిక తనిఖీ ప్రజావేదిక

నార్నూర్, జనవరి 1 : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఈ నెల 3వ తేదీన ఉదయం 10 గంటలకు ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించనున్నట్లు ఈజీఎస్ ఏపీవో రాథోడ్ సురేందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 21 డిసెంబర్ 2023 నుంచి 02 జనవరి 2024 వరకు మండలంలో చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ బృందం తనిఖీ నిర్వహించిందని, ప్రజావేదికలో పనుల వివరాలు, వెచ్చించిన ఖర్చును వెల్లడించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి అధికారులు, ప్రజాప్రతినిధులు, కూలీలు హాజరుకావాలని ఆయన కోరారు.

### ఎస్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్

ఎదులాపురం, జనవరి 1 : ఎస్‌టీయూటీఎస్- 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం క్యాంపు కార్యాలయంలో జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, మాజీ మంత్రి జోగు రామన్నలను వేరువేరుగా కలిసి శాలువాతో సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మూగ శ్రీనివాస్, జాదవ్ అశోక్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బెజ్జంకి రవీంద్ర, శీతల్ చౌహాన్, అదనపు ప్రధాన కార్యదర్శి దిలేశ్ చౌహాన్, ఉమ్మడి జిల్లా పూర్వ అధ్యక్షుడు చిలక విలాస్, నాయకులు పాల్గొన్నారు.

# వైభవంగా అయ్యప్ప పడిపూజ

తాంసి : పూజలు చేస్తున్న అయ్యప్ప స్వాములు

బోథ్, జనవరి 1 : సొనాలలోని రాంమందిరం ఆవరణలో అయ్యప్ప సేవా సమితి, గ్రామస్తులు సోమవారం అయ్యప్ప పడిపూజను వైభవంగా నిర్వహించారు. గురుస్వామి విశాల్ ఆధ్వర్యంలో గణపతి, సుబ్రహ్మణ్య స్వామి, అయప్ప పూజ చేశారు. స్వామి శరణుఘోష, భక్తి గీతాలతో ప్రాంతం మార్మోగింది. గురుస్వాములు రవి, రమేశ్, నాగరాజు, ప్రభాకర్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి భజన బృందం సభ్యులు పాల్గొన్నారు.

తాంసి, జనవరి 1: మండల కేంద్రంలో అయ్యప్ప స్వామి పల్లకీ ఊరేగింపు నేత్రనాయనంగా నిర్వహించారు. సోమవారం ఉదయం నుంచే భక్తులు, దీక్షాపరులు అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి సుప్రభాత సేవ, విశేష అలంకరణ చేశారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఉంచి గ్రామ ప్రధానవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో తాంసి సర్పంచ్ స్వప్న రత్న ప్రకాశ్, గురుస్వాములు పాల్గొన్నారు.

ఉట్నూర్, జనవరి 1: మండల కేంద్రంలో నిఅయ్యప్ప స్వామి ఆలయంలో వార్షికోత్సవం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారి దీపక్‌దూబే మాట్లాడుతూ అయ్యప్ప స్వామి మహిమలను వివరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, దీక్షాపరులు పాల్గొన్నారు.



బోథ్: పూజకు హాజరైన అయ్యప్పస్వాములు, మహిళలు

# గురుకృప దివస్‌ను విజయవంతం చేయాలి

నార్నూర్, జనవరి 1 : ఈ నెల11వ తేదీన జాతీయ బంజారా దీక్ష భూమిలో నిర్వహించే గురుకృప దినోత్సవానికి బంజారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కమిటీ అధ్యక్షుడు జాదవ్ రెడ్డినాయక్ పిలుపునిచ్చారు. సోమవారం కొత్తపల్లి(హెచ్) గ్రామంలోనిసేవాలాల్ మహారాజ్ దీక్షభూమిలో కమిటీ సభ్యులు దీక్షగురువు ప్రేమ్ సింగ్ మహారాజ్ ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11వ తేదీన దీక్ష గురువు ప్రేమ్‌సింగ్ మహారాజ్ అధ్యక్షతన భోగ్ బండార్, ప్రత్యేక పూజ కార్యక్రమాలు ఉంటాయని, ఈ వేడుకకు మహారాష్ట్ర, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్ మధ్యప్రదేశ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు తదితర రాష్ట్రాల నుంచి బంజారులు పెద్ద సంఖ్యలో తరలిరానున్న నేపథ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 7 నుంచి 12వ తేదీ వరకు జాతర ఉంటుందన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి గురుకృప దివస్‌ను జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జాదవ్ శ్రీరాం నాయక్, చౌహాన్ యశ్వంత్‌రావ్, నరహరి పాల్గొన్నారు.

# అయోధ్య అక్షింతలతో శోభాయాత్ర

తరోడ గ్రామంలో భజన చేస్తున్న గ్రామస్తులు

జైనథ్, జనవరి 1 : అయోధ్యలోని శ్రీరాముని అక్షింతలు సోమవారం తరోడ, గిమ్మా గ్రామాలకు చేరుకున్నాయి. ఈ అక్షింతలు గ్రామాల ప్రజలు భజన సంకీర్తనలతో పలు వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. తరోడలోని శ్రీకృష్ణ ఆలయంలో, గిమ్మా గ్రామంలోని శ్రీరామ హనుమాన్ ఆలయంలో అక్షింతలను పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రజుల్, నివాల్కర్ గజానన్ పాల్గొన్నారు.

గిమ్మా రామాలయంలో ..

### వైద్యురాలికి సన్మానం

విద్యార్థిని సన్మానిస్తున్న నాయకులు

ఉట్నూర్, జనవరి 1: ఉట్నూర్‌కు చెందిన ఉపాధ్యాయుడు పవార్ విజయ్ కుమార్, నేహా దంపతుల కూతురు వైద్యురాలు హర్షితను సోమవారం బంజారా నాయకులు తన నివాసంలో శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ చదువుల్లో రాణిస్తూ ఇంటర్‌లో రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు తెచ్చుకొని, నీట్‌లో జాతీయ స్థాయిలో 15వ ర్యాంకు సాధించి, ఒడిశాలోని భువనేశ్వర్ ఏఐఐఎంఎస్‌లో ఎంబీబీఎస్ పూర్తిచేసిన హర్షిత గిరిజన జాతికే వన్నె తెచ్చిందన్నారు. నీట్ పీజీ ఎంట్రెన్స్‌లో రాజస్థాన్ రాష్ట్రంలోని జోద్‌పూర్ ఏఐఐఎంఎస్‌లో ఎండీ బయో కెమిస్ట్రీలో సీటు సాధించిందన్నారు. కార్యక్రమంలో బంజారా నాయకులు బానోత్ రామారావ్, భరత్ చౌహాన్, రాథోడ్ గణేశ్, జేపీ నాయక్, హిందూ ఉత్సవ సమితి సభ్యులు రాజగోపాల్, అంజయ్య పాల్గొన్నారు.

### ఆలయ అభివృద్ధికి సహకరించండి

ఖానాపూర్ టౌన్, జనవరి 1 : ఖానాపూర్‌లోని అయ్యప్ప స్వామి దేవాలయం అభివృద్ధికి సహకారం అందించాలని కోరుతూ పలువురు అయ్యప్ప భక్తులు ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావును కోరారు. సోమవారం అదిలాబాద్‌లో ఎంపీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఎంపీ సానుకులంగా స్పందించి అలయానికి రూ. 20 లక్షల నిధు ల మంజూరు కృషి చేస్తానని హామీ ఇచ్చారని ఆలయ కమిటీ అధ్యక్షుడు అడిదెల రాజన్న తెలిపారు. కార్యక్రమంలో సట్ల శంకర్, అర్చకులు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

### గోశాలకు విరాళం

ఇచ్చోడ, జనవరి 1 : బోరిగామ గ్రామ పంచాయతీ పరిధిలోని బాబుల్‌డోర్ శివారు ప్రాంతంలోని రామ లక్ష్మణ్ ఆలయం వద్ద ఉన్న జైశ్రీరామ గోశాలకు ఇచ్చోడ ఉప సర్పంచ్ లోక శిరీష్ రెడ్డి తనవంతుగా రూ.10 వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త నిమ్మల సంతోష్ రెడ్డి, ఐద రాజు, రాథోడ్ అనిల్ పాల్గొన్నారు.

### బైక్ ఢీకొని ఒకరి మృతి

సోన్, జనవరి 1 : నిర్మల్ మండలం రత్నా పూర్‌కాండ్లీ గ్రామానికి చెందిన పోతరాజు (35) అనే వ్యక్తి ద్విచక్రవాహనం ఢీకొని మృతి చెందినట్లు నిర్మల్ రూరల్ ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పోతరాజు ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో కిరాణా దుకాణానికి వెళ్లి తిరిగి వస్తుండగా నిర్మల్ నుంచి ఖానాపూర్ వైపుకు వెళ్తున్న ఓ ద్విచక్ర వాహ నం ఢీకొట్టింది. దీంతో బలమైన గాయాలు కావడంతో స్థానికులు 108 వాహనంలో నిర్మల్ ఏరియా దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించడంతో సోమవారం మృతి చెందినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలి పారు. అయితే ఢీకొట్టిన వ్యక్తి ద్విచక్ర వాహనాన్ని అక్కడే వదిలేసి పారిపోయినట్లు ఎస్ఐ వివరించారు.